నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. చంపాపేట, కర్మన్‌ఘాట్ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గ్రీన్‌పార్కు, కర్మన్‌ఘాట్, శ్రీరామ్‌నగర్, నిర్మలానగర్, హనుమాన్‌నగర్, సాయిరాంనగర్ కాలనీలలో అదేవిధంగా సుల్తానాఅల్వా ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు కటకోనికుంట, చంపాపేట పాత బస్తీ, సుల్తానాఅల్వా, బస్తీ దవాఖానా ప్రాంతం, రాజిరెడ్డినగర్ కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

ఓట్ చోరీపై ఆందోళన తీవ్రతరం



సంతకాల సేకరణలో పాల్గొన్న దేప భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఓట్ చోరీపై ఆందోళన కార్యక్రమాలు తీవ్రం చేస్తామని టీపీసీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో ఓట్ చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేప భాస్కర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఓట్ చోరీపై రాహుల్ గాంధీ చేపట్టిన ఆందోళనకు మద్దతుగా మహేశ్వరం నియోజకవర్గంలో ప్రజలను చైతన్య పరుస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, గట్ల రవీంద్ర, ఖిల్లా మైసమ్మ దేవాలయం చైర్మన్ సురేష్, రాజు నాయక్ పాల్గొన్నారు.

12న రాష్ట్ర స్థాయి పద్మశాలీ దసరా మేళా

మన్సూరాబాద్: ఈ నెల 12న రాష్ట్ర స్థాయి పద్మశాలీ దసరా మేళాను నిర్వహిస్తున్న పద్మశాలీ సంఘం ఎల్‌బీనగర్ సర్కిల్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, పద్మశాలీ దసరా మేళా చైర్మన్ కొకుంట్ల రవితేజనేత అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి అనన్య ఎకో పార్కులో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పద్మశాలీ సంఘం ఎల్‌బీనగర్ సర్కిల్ ఆధ్వర్యంలో హరిణి వనస్థలి (డీర్‌పార్కు)లోని అనన్య ఎకో పార్కులో జరిగే 23వ పద్మశాలి దసరా మేళాకు పద్మశాలీయులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం నేతలు రాపోలు సుధాకర్, గడ్డం లక్ష్మినారాయణ, గుర్రం శ్రావణ్ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు



నాగోలు: మానవ అక్రమ రవాణాపై విద్యార్థులకు శుక్రవారం ఎల్‌బీనగర్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ జోనల్ క్యాంపస్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. రాచకొండ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఎస్ఐ రాములు నాయక్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు-మహిళకు మాయ మాటలు చెప్పి అక్రమ రవాణా చేసే వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద సమాచారం తెలిసిన వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ రూప, వైస్ ప్రిన్సిపాల్ హృషిత పాల్గొన్నారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరికి జైలు



రితీష్

మలక్‌పేట: మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వేర్వేరు సంఘటనల్లో ఇద్దరికి కోర్టు జైలు శిక్ష ఖరారు చేసిందని ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ తెలిపారు.

◆ మూసారంబాగ్ డివిజన్ అఫ్జల్‌నగర్ బంజరా బస్తీకి చెందిన రితీష్ (21) ప్రైవేట్ ఉద్యోగి. గురువారం పక్కింటి వారితో గొడవ పడి వారిని కొట్టాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శుక్రవారం 7వ, స్పెషల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా అతనికి 5 రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు నిచ్చిందని తెలిపారు.

13 ఏళ్లుగా బైక్ రిజిస్ట్రేషన్ లేకుండా నడుపుతూ..



నాగదత్తు

మలక్‌పేట పోలీసులు గురువారం దిల్‌సుఖ్‌నగర్‌లో చేపట్టిన వాహనాల తనిఖీలలో నాగోల్ లలిత నగర్ ప్రాంతానికి చెందిన అవునా నాగదత్తు(26)ప్రైవేట్ ఉద్యోగి పోలీసులకు పట్టుబడ్డాడు. నంబర్ లేకుండా వాహనం నడుపుతుండగా బైక్ తనిఖీ చేయగా 13 ఏళ్లుగా రిజిస్ట్రేషన్ లేకుండా బైక్ నడుపుతున్నట్లు తేలింది. దీంతో అతనిపై కేసు నమోదు చేసి ఏడవ స్పెషల్ కోర్టు ఎదుట హాజరు పరచగా 2 రోజులు జైలు శిక్ష ఖరారు చేసిందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



వనస్థలిపురం రత్నదీప్ సూపర్ మార్కెట్ ముందు..



వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ వద్ద రోడ్డుపైకి వచ్చిన వాహనాల పార్కింగ్

రోడ్డుపైనే పార్కింగ్..
ఇదేం చోద్యం

ట్రాఫిక్ సుడిగుండంలో వనస్థలిపురం



వనస్థలిపురం గణేష్ టెంపుల్ ప్రధాన రోడ్డులో రాత్రివేళ ట్రాఫిక్‌జాం

- పోలీస్ స్టేషన్ వద్ద కూడా ఇదే పరిస్థితి
- వ్యాపార సముదాయాల ముందు రోడ్డుపై వాహనాల పార్కింగ్
- ట్రాఫిక్‌జాంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

వనస్థలిపురం: వాణిజ్య పరంగా దినదినాభివృద్ధి చెందుతున్న వనస్థలిపురంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయి. వనస్థలిపురం ప్రధాన రహదారులలో పేరొందిన కంపెనీలకు చెందిన షోరూంలు, సూపర్ మార్కెట్లు, కార్పొరేట్ కళాశాలలు, స్కూళ్లు, బ్యాంకులు, హోటళ్లు, పలు వాణిజ్య సముదాయాలు ఏర్పడడంతో రద్దీ ప్రాంతాలుగా మారాయి. అయితే వాణిజ్య సముదాయాలు, సూపర్ మార్కెట్లు, బ్యాంకులకు సరైన పార్కింగ్ వసతి లేకపోవడంతో వాటి వినియోగదారులు తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ఆ దారిన వెళ్ళే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు విజయవాడ జాతీయ రహదారి, నాగార్జునసాగర్ రహదారులపై చలాన్లు రాయడానికి పరిమితం అవుతున్నారు తప్ప వనస్థలిపురంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

◆ వనస్థలిపురం ప్రధాన రహదారిలో ఉన్న పోలీసుస్టేషన్‌కు వచ్చేవారు, సిబ్బంది తమ వాహనాలను రోడ్డుపైనే రెండు వరుసల్లో పార్కింగ్ చేస్తుండడంతో రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

◆ పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ వద్ద ఇదే పరిస్థితి. బ్యాంకుకు వచ్చే ఖాతాదారులు బ్యాంకుకు సరైన పార్కింగ్ వ్యవస్థ లేకపోవడంతో తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌జాంలు తప్పడం లేదు.

◆ ప్రధాన రహదారిపై ఉన్న రత్నదీప్ సూపర్ మార్కెట్‌కు వచ్చిన కస్టమర్లు రోడ్డుపై, పక్కనే ఉన్న కాలనీ అంతర్గత రోడ్డుపై తమ వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో వాహనదారులు, కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు.

◆ వనస్థలిపురం గణేష్ టెంపుల్, షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతాలలో వాహన దారులు తమ వాహనాలను విచ్చలవిడిగా రోడ్డు వెంబడి పార్కింగ్ చేస్తుండడంతో ఆ దారిన వెళ్ళే వాహనదారులు, ఆర్‌టీసీ బస్ డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు.

◆ వనస్థలిపురం గణేష్ టెంపుల్ నుంచి బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తా వరకు రాత్రి వేళ నిత్యం ట్రాఫిక్ జాంలు ఏర్పడుతున్నాయి. ఆయా వ్యాపార సంస్థల ముందు వాహనదారులు తమ వాహనాలను అడ్డగోలుగా పార్కింగ్ చేస్తుండడంతో రోడ్డు కుంచించుకుపోయి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలి..

రోడ్డుపై సరైన పార్కింగ్ సదుపాయం లేని సూపర్ మార్కెట్లు, వ్యాపార సముదాయాలకు నోటీసులు ఇచ్చాం. వనస్థలిపురంలోని రత్నదీప్ సూపర్ మార్కెట్ వారికి కూడా నోటీసులు ఇచ్చాం. ఈ విషయమై జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. పార్కింగ్ సదుపాయం లేని వాణిజ్య సంస్థల మూసివేతకు వారు చర్యలు తీసుకోవాలి. మేము రోడ్డుపై పార్కింగ్ చేసిన వారికి మాత్రమే చలాన్లు వేయగలం)

– బి.గట్టుమల్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, వనస్థలిపురం

చేనేత కార్మికుల రుణాలు మాఫీ చేయాలి



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు

మన్సూరాబాద్: చేనేత కార్మికుల రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించి ఏడాది గడిచిపోయిన మాఫీ కాలేదని, తక్షణమే మాఫీ చేయాలని చేనేత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. చేనేతశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కమిషనర్ శైలజారామయ్యర్‌కు శుక్రవారం వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మన్సూరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ అతి త్వరలో చేనేత కార్మికుల రుణాలను మాఫీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. త్రిఫ్ట్ పథకంలో బాగంగా చేనేత కార్మికులు జమ డబ్బు జమ చేశారని, ప్రభుత్వం రూ.7కోట్ల నిధులు మంజూరు చేయగానే హ్యాండ్ లూమ్ టెక్స్‌టైల్ శాఖ జమ చేస్తుందని కమిషనర్ తెలిపారని పేర్కొన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మా బతుకులు రోడ్డుపాలు కాకుండా చూడండి



జీహెచ్‌ఎంసీ ఆఫీస్ ఎదుట నిరసన తెలియజేస్తున్న బాధితులు

మలక్‌పేట: మూసారంబాగ్, అలీ కేఫ్, అంబర్‌పేటకు చెందిన మూసీ బ్రిడ్జి బాధితులు శుక్రవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయానికి తరలి వెళ్లారు. తమకు న్యాయం చేయాలంటూ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూసీనదిపై మూసారంబాగ్ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి వెడల్పు 100 అడుగులుగా నిర్ణయించారన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో ఇరువైపులా 50 కుటుంబాలు రోడ్డుపాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కిందికి దిగుతున్న ర్యాంపు నాలుగు లైన్ల రోడ్డు సవరిస్తే ఎవరికీ ఇబ్బంది ఉండదని, రోడ్డు కటింగ్ వలన దాదాపు 150 వ్యాపారాలు పోయి ఉపాధి కోల్పోతున్నారు. తమకు న్యాయం చేయాలని బాధితులు ప్రభుత్వాన్ని కోరారు.

తాగునీటి వృథాను అరికట్టండి



వృథాగా పోతున్న తాగునీరు

ఎల్‌బీనగర్: తాగునీరు వృథా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాగునీటి లీకేజీలతో ఎల్‌బీనగర్‌లో పలు చోట్ల రోజు వేల లీటర్ల నీరు వృథాగా రోడ్లపాలు అవుతున్నాయి. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎస్‌కేడీ నగర్ డీపీఎస్ స్కూల్‌వద్ద గత కొన్ని రోజులు తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఫిర్యాదులు చేసినా ఇటు వైపు జలమండలి అధికారులు, సిబ్బంది కన్నెత్తి కూడా చూడలేదని స్థానికులు పేర్కొంటున్నారు. అసలే వర్షాకాలం ఇలా నీరు లీకేజీ అవుతుండడంతో వర్షంనీటితో పాటు డ్రైనేజీ నీటిలో కలవడం వలన అంటు రోగాలు ప్రబలే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు లీకేజీలను అరికట్టి నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బీసీ సంఘాల నిరసన

మన్సూరాబాద్: బీసీ రిజర్వేషన్ల అమలులో మొదటి నుంచి కుట్ర జరుగుతోందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర నాయకుడు కోట్ల వాసుదేవ్ అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుపై హైకోర్టు స్టే విధించటాన్ని నిరసిస్తూ ఎల్‌బీనగర్‌లో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని దహనం చేయటాన్ని ఎల్‌బీనగర్ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అలాగే బీసీ కులాల సమన్వయ వేదిక అధ్యక్షుడు బొమ్మ రఘురామ్‌నేత, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కమిటీ సభ్యుడు చామకూర రాజు ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డులో శుక్రవారం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

వృద్ధులు సమాజానికి మూల స్తంభాలు

రాచకొండ సీపీ సుధీర్‌బాబు



సీనియర్ సిటిజన్ల కోసం గోల్డెన్ కేర్ హెల్త్ క్యాంప్‌లో పాల్గొన్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు..

నాగోలు: తమ జీవితకాలంలో సమాజానికి సేవలు అందించిన వృద్ధులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్‌బాబు అన్నారు. కామినేని హాస్పిటల్స్ సహకారంతో సీనియర్ సిటిజన్ల కోసం గోల్డెన్ కేర్ హెల్త్ క్యాంప్‌ను శుక్రవారం నాగోలులోని పీఎంఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ.. రాచకొండ కమిషనరేట్ పరిధిలో 470 మంది వృద్ధులను గుర్తించి వారి వద్దకు పోలీసు సిబ్బంది వ్యక్తిగతంగా వెళ్లి వారిని పరామర్శించి, అవసరమైన సహాయం అందిస్తూ మీకు మేమున్నాం అనే భరోసాను కల్పిస్తున్నామని వివరించారు. గోల్డెన్ కేర్ ద్వారా వృద్ధుల సంక్షేమం, వైద్య, ఆరోగ్య, బీమా, అత్యవసర సహాయంలో పోలీసులు ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ డీసీపీ అనురాధ, మహిళా భద్రతా డీసీపీ ఉషారాణి, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.23, వంకాయ రూ.35, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.38, క్యాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.23, క్యారెట్ రూ.47, దొండ రూ35, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.20, గోకరకాయ రూ.55, దోసకాయ రూ.18, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.60, చామగడ్డ రూ.23, మునగ రూ.40, కందగడ్డ రూ.40, బీట్‌రూట్ రూ.40, కీర రూ.23, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.55. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

బొడ్రాయి పూజలో ఎమ్మెల్యే

హయత్‌నగర్: హయత్‌నగర్‌లో జరుగుతున్న బొడ్రాయి(నాభిశిల) ప్రతిష్ఠాపన ఉత్సవాలలో బాగంగా శుక్రవారం బొడ్రాయి జలాభిషేకం కార్యక్రమం వైభవంగా జరిగింది. వేల సంఖ్యలో మహిళలు బొడ్రాయికి జలాభిషేకం చేశారు. గ్రామంలోని గ్రామ దేవతల గుళ్ళను సంప్రోక్షణ చేసి అలంకరించారు. స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కళ్ళెం నవజీవన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.



బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

బాలింతలు,గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



దిల్‌సుఖ్‌నగర్: బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సావిత్రి సూచించారు. ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ లో శుక్రవారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. సావిత్రి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా పౌష్టికాహారాన్ని అందిస్తున్నాయని ఆమె వివరించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ సేవలు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు గంగ, సునీత పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కాలనీ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని సాయిరాంనగర్‌కాలనీలో రూ.38 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న అబివృద్ధి పనులను చూసి ప్రజలు హర్షిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, కిరణ్, మాధవరావు, కోడి రాజశేఖర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి



కార్పొరేటర్ పవన్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశా వర్కర్లు

నాగోలు: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తానని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. శుక్రవారం కొత్తపేట డివిజన్ పరిధిలోని ఆశా వర్కర్లు కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్‌ను కలిసి సమస్యను వివరించారు. కార్పొరేటర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ ఆశా వర్కర్లు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు గట్టు మహేష్ కుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజులు వసూలు చేయాలి



హస్తినాపురం: పెండింగ్ బకాయిలు విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని జాతీయ బీసీ కమీషన్ మాజీ సభ్యులు ఆచారి ఆరోపించారు. శుక్రవారం హస్తినాపురం చౌరస్తాలో రంగారెడ్డి జిల్లా బీజేపి కార్యదర్శి నరేశ్‌యాదవ్ చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షకు ఆచారి మద్దతు తెలిపారు. బీసీలకు తీరని అన్యాయం చేస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ సమాజం తగిన విధంగా బుద్ధి చెబుతుందన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపి పార్టీ అధ్యక్షుడు వన్‌పల్లి శ్రీనివాస్‌రెడ్డి, చిట్టిప్రోలు రవికుమార్ పాల్గొన్నారు.

పీఈటీల నియామకాలు చేపట్టాలి

మలక్‌పేట: మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల శుక్రవారం నగరంలోని కార్యాలయంలో తెలంగాణ పాఠశాల విద్యా కమిషనర్, డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్‌ను కలిశారు. జిల్లాలో పాఠశాల విద్యా విభాగంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్(పీఈటీ)నియామకాలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. పీఈటీల కొరత తీర్చడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ఆన్‌లైన్‌లో చిన్న పిల్లల అశ్లీల దృశ్యాలు.. ఇద్దరి అరెస్ట్

చాదర్‌ఘాట్: చిన్న పిల్లల అశ్లీల దృశ్యాలు ఆన్‌లైన్‌లో పంపిన ఇద్దరు వ్యక్తులపై చాదర్‌ఘాట్, డబీర్‌పురా పీఎస్‌ల పరిధిలో కేసులు నమోదు చేసారు. మలక్‌పేట ఏసీపీ సుబ్బరామిరెడ్డి తెలిపిన మేరకు.. చంచల్‌గూడ నివాసి మహమ్మద్ హుస్సేన్ (34), అజంపురాకు చెందిన సయ్యద్ జమీల్ (32)లు ఆన్‌లైన్‌లో చిన్న పిల్లల అశ్లీల దృశ్యాలు పంపటాన్ని సైబర్ క్రైమ్ పోర్టల్ ఎన్‌సీఆర్‌బీ ద్వారా పోలీసులు గుర్తించారు. వారిని అరెస్ట్ చేసి జ్యూడీషియల్ కస్టడీకి తరలించారు. వారిపై షీట్స్ కూడా తెరుస్తామని ఏసీపీ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

చైతన్యపురి: అపార్టుమెంటులో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి అదృశ్యం అయ్యాడు. చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన మేరకు.. తూర్పు గోదావరి రాజంపూడికి చెందిన కర్నాటి రాంబాబు, కుమారి దంపతులు కొత్తపేటలో ఉంటున్నారు. సత్యానగర్ కాలనీలోని ఓ అపార్టుమెంటులో రాంబాబు వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. అతని బార్య కుమారి బట్టల దుకాణంలో స్వీపర్‌గా పనిచేస్తోంది. కొన్ని రోజులుగా రాంబాబు మద్యం తాగుతుండటంతో గురువారం భార్య కుమారి మందలించింది. తరువాత పనిలోకి వెళ్లింది. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా రాంబాబు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా అతని జాడ తెలియకపోవటంతో శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.